06ATP27_06ATP27.qxd 22-03-2024 PM 10:52 Page 1



# వ్యాసాపురం గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి..!

**- 20 రోజులుగా సరఫరాకాని సీపీడబ్ల్యూ స్కీమ్ నీళ్లు**
**- నీటి కోసం వ్యవసాయ బోర్లపై ఆధారపడుతున్న ప్రజలు**
**- హంద్రీనీవాకు నీటిని నిలిపివేయడంతో మరింత ఇబ్బందులు**

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త



గ్రామంలోని సంప్‌లో నిలబడ్డ నీటిని తోడుకోవడానికి ఎగబడుతున్న ప్రజలు

మండల పరిధిలోని వ్యాసాపురం గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెల కొంది. గ్రామానికి నింబగల్లు గ్రామం వద్దగల సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా నీటి సరఫరా జరుగుతుండగా 20 రోజులుగా సరఫరా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి సీపీడబ్ల్యూ స్కీమ్ నీటి సరఫరా తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. కొందరు స్థానిక మారెమ్మ గుడివద్ద సీపీడబ్ల్యూ స్కీమ్‌కు చెందిన సంప్‌లో నిలబడిన నీటిని అతికష్టం మీద తోడుకొంటున్నారు. మరికొందరు వ్యవసాయ బోర్లు ఉన్నవారిని బ్రతిమలాడి నీటిని తెచ్చుకొంటున్నారు. తాగడానికి తప్పనిసరి పరిస్థితుల్లో క్యాన్ 10 రూపాయల చొప్పున నీటిని కొనాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. నిన్నా మొన్నటి వరకు హంద్రీనీవా కాలువలో నీరు అందుబాటులో ఉండటంతో ఆ నీటిని తెచ్చుకునే వారమని మూడు రోజుల క్రితం కాలువకు నీటిని నిలిపివేయడంతో కాలువలో నీరులేక మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పోలాల్లోని బోర్ల నుండి డ్రమ్ముల ద్వారా ట్రాక్టర్‌లో నీటిని తెచ్చుకొంటున్న దృశ్యం

# వెలిగొండ గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ

**- ఇంటింటి ప్రచారం నిర్వహించిన పయ్యావుల విజయ్‌సింహా**

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త



పూలమాలతో పయ్యావుల విజయ్‌సింహాకు స్వాగతం పలుకుతున్న స్థానిక టీడీపీ నాయకులు

మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విక్రమ్ సింహా ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఆయన గ్రామానికి చేరుకోగానే స్థానిక టీడీపీ నాయకులు ఆయన ఘన స్వాగతం పలికారు. తొలుత స్థానిక సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన పయ్యావుల విక్రమ్‌సింహా కరపత్రాలు పంపిణీ చేస్తూ టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసే 6 గ్యారంటీలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తుకోసం కూటమిని ఆదరించాలని పయ్యావుల కేశవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

# ఉరవకొండ సెబ్ సీఐపై రిటర్నింగ్ అధికారికు పిర్యాదు

**- ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇంచార్జ్ కె.వి.రమణ**

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త

మద్యం వినియోగదారుల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న ఉరవకొండ సెబ్ సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్‌కు పిర్యాదు చేసినట్లు బెస్త కార్పొరేషన్ డైరెక్టర్, ఉరవకొండ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ కె.వి.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండ పట్టణంలోని లత్తవరం రోడ్డులోగల ప్రభుత్వం మద్యం దుకాణంవద్ద సెబ్, ఎక్సైజ్ సీఐలు వారి సిబ్బంది మద్యం వినియోగదారులపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. మద్యందుకాణంలో మద్యంవిక్రయించి వంద మీటర్లుదాటకనే వారిసిబ్బందితో మద్యంప్రియులను సీఐఅరెస్టు చేయిస్తున్నారన్నారు. అరెస్టుచేసిన వారిని ఉదయం నుండి సాయంత్రం వరకు స్టేషన్‌లోనే కూర్చోబెట్టి అవమానించి వారు అమ్మిన మద్యాన్ని వారే స్వాధీనం చేసుకొని అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సెబ్‌సీఐ వారి సిబ్బంది చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మద్యం వినియోగదారుడు 5 బాటిళ్ల వరకు మద్యం కొనడానికి అర్హత ఉన్నా ఒక్క బాటిల్ మద్యం కొనుక్కొని వెళుతున్న వారిని కూడా సీఐ సిబ్బందితో అరెస్టు చేయించి జరిమానా విధించడం విడ్డూరంగా ఉందన్నారు. కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న సీఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఓకు పిర్యాదు చేశామన్నారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్ఓ భరోసా ఇచ్చారని కె.వి.రమణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వీరేష్, పెద్దిరెడ్డి ఉన్నారు.

# ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా జట్లకు కొనసాగుతున్న శిక్షణ

**- శిక్షణ ఇస్తున్న అంతర్జాతీయ క్రీడాకారులు అశోక్, శివ, మధు**

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త



శిక్షణకు హాజరైన క్రీడాకారులకు సూచనలిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెపక్‌తక్రా జూనియర్, సబ్ జూనియర్ బాల బాలికల జట్లకు శిక్షణా కార్యక్రమం కొనసాగుతోంది. సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ఛైర్మెన్ సప్తగిరి మల్లికార్జున, అధ్యక్షులు ఎం.ఎన్. షాహీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ సి.మారుతి పర్యవేక్షణలో పట్టణంలోని పోలీస్ మైదానంలో శిక్షణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల నెల్లూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా జూనియర్, సబ్ జూనియర్ బాల బాలికలు రాష్ట్రస్థాయి టోర్నమెంటులో మంచి ప్రతిభ కనబర్చగా వారిని ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా జట్లకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. సెపక్ తక్రా అంతర్జాతీయ క్రీడాకారులైన కర్నూల్ జిల్లాకు చెందిన అశోక్, శివ, ప్రకాశం జిల్లాకు చెందిన మధు, కోచ్ శ్రీనివాసులుతో కలసి క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ మెలుకువలు నేర్పుతున్నారన్నారు. శిక్షణా శిబిరం ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని 26 నుండి 30 వరకు కర్నాటక రాష్ట్రం ధావన్‌గిరిలో జరిగే జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ఇక్కడ శిక్షణ పొందిన బాల బాలికల జూనియర్, సబ్ జూనియర్ జట్లు పాల్గొంటాయన్నారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంవారు వసతి కల్పిస్తుండగా, సెపక్‌తక్రా జిల్లా సంఘం ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించడం జరుగుతోందని వివరించారు.



శిక్షణ తీసుకొంటున్న క్రీడాకారులు

# విద్యాసంవత్సరం ముగియకుండానే అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

**- తహాశీల్దార్‌కు విన్నవించిన విద్యార్థి సంఘాల నాయకులు**

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త



తహాశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

2023-24 విద్యా సంవత్సరం ముగియకుండానే ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ల కోసం కొన్ని కళాశాలలు విచ్చలవిడిగా 10వ తరగతి పరీక్షా కేంద్రాలవద్ద ప్రచారం నిర్వహిస్తున్నాయని వాటిని నిలువరించడానికి చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దార్థ, యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మ, ఐసా జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు భీమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల తహాశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ దగ్లోబల్ స్కూల్, కాలేజ్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించిందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మాయమాటలు చెబుతూ మండల వ్యాప్తంగా పాఠశాలలు, పరీక్షా కేంద్రాలవద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్నా మండల విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# పార్టీను నమ్ముకొని పనిచేస్తున్న సీనియర్లకు పార్టీ టికెట్టు కేటాయించాలి

**- తీర్మాణంచేసి పార్టీ పెద్దలకు పంపామన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్లు**

ఉరవకొండ, మార్చి 22 ప్రభాతవార్త

రాష్ట్రం విడిపోయినప్పటి నుండి పార్టీను నమ్ముకొని పదేళ్ళుగా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్లకు పార్టీ టికెట్టు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సోనియా శీన, కార్యదర్శి ఇంద్రావతిఓబులేసు, మైనార్టీవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.అబ్బాస్ (రహిమాన్), మాజీ మండలకన్వీనర్ రాజశేఖర్, బెలుగుప్ప మండల కన్వీనర్ పి.బాబాసాహెబ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు బి.అమర్‌నాథ్, పట్టణ అధ్యక్షులు టి.సుధాకర్, సమన్వయకర్త జి.గోపాల్‌రెడ్డి, వజ్రకరూరు మాజీ మండల కన్వీనర్ యం.వన్నూరుస్వామి కోరారు. ఈనెల 17న ఉరవకొండ పట్టణంలోని ఒక లాడ్జీలో సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించి ఏకాభిప్రాయంతో తీర్మాణ లేఖను ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలరెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డిలకు పంపినట్లు శుక్రవారం వారు ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. రాష్ట్రం విడిపోయినప్పటి నుండి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం లేకపోయినా పార్టీ కోసం కష్టపడిన వాళ్లని కాకుండా ఏరోజూ పార్టీకోసం పనిచేయనివాళ్లకు పార్టీపెద్దలు అసెంబ్లీటికెట్టు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో దివంగత మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ అన్న కొడక్కు టికెట్టు ఇచ్చారని దీంతో సదరు వ్యక్తికి కేవలం 1,185 ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. 2019లో కూడా పార్టీ అదిష్టానం అదే తప్పు చేసిందన్న వారు కమ్మ కులస్తుడని, పరిటాల అనుచరుడని పార్టీ టికెట్టు ఇస్తే అతనికి 2,394 ఓట్లు పడ్డాయన్నారు. సీనియర్లను మరిచి వీరిద్దరికీ అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డే టికెట్లు కేటాయించారన్నారు. ఇప్పుడు తాజాగా మాజీ ఎమ్మెల్యే తమ్ముడికి టికెట్టు ఇస్తారని ప్రచారం జరుగుతోందని వారందరి కన్నా ఎక్కువ ఓట్లు సాధించే సీనియర్లు పార్టీలో ఉన్నారని వారివద్ద డబ్బులు లేకపోయినా మంచితనంతో ముందుకెళ్లే సత్తా ఉందని సీనియర్లకే టికెట్టు కేటాయించాలని కోరారు.

# ప్రశాంతంగా ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోండి

చెన్నేకొత్తపల్లి, మార్చి 22 ప్రభాతవార్త



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ధర్మవరం డిఎస్పీ పృథ్వి ఆధ్వర్యంలో రామగిరి సిఐ చెన్నేకొత్తపల్లి ఎస్సై ప్రత్యేక బలగాలతో శుక్రవారం గ్రామలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, గ్రామాల్లో ప్రజలకు తెలియజేస్తూ, సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా సహకరించాలని, ప్రజలకు తెలియజేశారు. అలాగే గ్రామాలలో అనుమానం ఉన్న గృహాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగిరి సర్కిల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**- రిటర్నింగ్ అధికారి గౌరీ శంకర్**

మడకశిర టౌన్, మార్చి 22 ప్రభాతవార్త

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రిట్నింగ్ అధికారి గౌరీ శంకర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల కోడ్ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్కడ ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగితే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే సమగ్ర దర్యాప్తుచేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంటింటి ప్రచారం చేయడానికి కూడా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కోరారు. ప్రతి పర్మిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి పొందాలన్నారు. నోడల్ అధికారులుగా అన్ని శాఖల నుంచి నియమించామని చెప్పారు. 19 కేటగిరిలు అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లౌడ్ స్పీకర్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ స్థలంలో జెండాలు, ప్లెక్సీలు కడితే స్థల యజమాని అంగీకార పత్రంతో అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలి, ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వెంకటేషులు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బరిలో భరణి

పుట్టపర్తి రూరల్ మార్చి 22 ప్రభాతవార్త



కాంగ్రెస్ అభ్యర్థి భరణి ఫైల్‌ఫోటో

కాంగ్రెస్ పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్నికల బరిలో పోటి చేయడానికి సిద్దంగా ఉన్నట్లు కె.భరణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యలయంలో పిసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలనుకలిసి తనఅభ్యర్థిత్వాన్ని అందజేశారు. తన మామ కె లక్ష్మినారాయణ దివంగత మాజీముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి కి అత్యంత విధేయుడిగా ఉన్నారని, గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేశాడన్నారు. నియోజకవర్గ కేంద్రంలో నివాసం ఉండి తన అనుచర వర్గంతో కాంగ్రెస్ పార్టి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని పెర్కొన్నారు. అనంతరం వైయస్ విజయమ్మని కలవడానికి హైదరాబాద్‌కు వెళ్లినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వైయస్ కుటుంబానికి లక్ష్మినారాయణ విధేయుడై ఉండడం, ఒకే గ్రామానికి చెందిన వారవడంతో తన కోడలైన భరణి కి కేటాయించే అవకాశం ఉన్నదని ధీమా వ్యక్తంచేశారు. ఇప్పటికే పుట్టపర్తి అసెంబ్లీ స్టానానికి దాదాపు 8 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# కర్ణాటక మద్యం స్వాధీనం

గుత్తి, మార్చి 22 ప్రభాతవార్త



కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న దృశ్యం

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను పటిష్టపరిచారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం వ్యవహారం వెలుగు చూసింది. గుత్తి రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ నాగేంద్ర దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 50 వేల రూపాయల విలువ చేసే 702 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితులైన పత్తికొండకు చెందిన సుజాత, నాగేంద్రలను అదుపులోకి తీసుకుని వారి వద్ద మద్యంతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని పత్తికొండకు తరలించేందుకు యత్నిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆశాబేగం, కానిస్టేబుళ్లు బాషా, బొజ్జప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా స్కిల్ కాంపిటేషన్‌కు గేట్స్ విద్యార్థులు ఎంపిక

గుత్తి, మార్చి 22 ప్రభాతవార్త



ప్రతిభ చూపిన విద్యార్థులు

జాతీయస్థాయిలో జరిగే అతి పెద్ద నైపుణ్యత ప్రదర్శనకు గాను రాష్ట్ర స్థాయిలో స్థానిక గేట్స్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. విజయవాడలో మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ మరియు నేషనల్ స్కిల్ కార్పోరేషన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సిఇఇ, ఇఇఇ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ విభాగంలో విద్యను అభ్యసిస్తున్న విజయకుమార్, వీరేష్, రోహిత్, బాబాఫకృద్దిన్, శర్వాణి, మాధురిలు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. వీరు జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ప్రపంచస్థాయిలో ఫ్రాన్స్‌లో జరగనున్న పోటీల్లో విజేతలుగా నిలవాలని కళాశాల యాజమాన్యం వారిని అభినందించింది.

# కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేసిన సెబ్ కమీషనర్

విడపనకల్లు, మార్చి 22 ప్రభాతవార్త



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సెబ్ కమీషనర్

మండలంలోని కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులతో పాటు విడపనకల్లు, డోనేకల్లు తనిఖీ కేంద్రాలను శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమీషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న తీరును గమనించారు. విధుల్లో వున్న వివిధ రకాల అధికారులు, సిబ్బంది గురించి ఆరా తీశారు. ఎన్నికల దృష్ట్యా కర్ణాటక రాష్ట్రం నుండి మద్యం, నగదు, తదితర నిషేధిత వస్తువులు అనంతపురం జిల్లాలోనికి రాకుండా 24/7 అన్ని వాహనాలు పూర్తిగా, క్షుణ్ణంగా పరిశీలన చేయడంజరుగుతుందని ఆయనతెలిపారు. ఇందులోభాగంగా రెండు చెక్‌పోస్టులను తనిఖీచేసి అక్కడున్న అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అలాగే డోనేకల్లు చెక్‌పోస్టులో ముగ్గురు వ్యక్తుల నుండి 6మద్యం టెట్రాప్యాకెట్లు, 8మద్యంబాటిళ్లు, 3బీరుబాటిళ్లను, ఒక మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో మహిళా పోలీసులు కీలక పాత్ర వహించాలి

ధర్మవరం రూరల్, మార్చి 22 ప్రభాతవార్త





మాట్లాడుతున్న దిశ డిఎస్‌పి శ్రీనివాసులు

వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో మహిళా పోలీసులు కీలక పాత్ర వహించాలని డిఎస్‌పి శ్రీనివాసులుపేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని గాంధీ నగర్‌లో గల మారుతి రాఘవేంద్ర స్వామికళ్యాణ మండపంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ధర్మవరం సబ్ డివిజన్‌లోని సచివాలయ మహిళా పోలీసులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డిఓ వెంకటశివారెడ్డి, దిశ డిఎస్‌పి శ్రీనివాసులు, దిశ డిఎస్పీ విక్రమ్ పాల్గొన్నారు. అనంతరం డిఎస్పీ శ్రీనివాసులతోపాటు దిశా డిఎస్పీలు, ఆర్డిఓ మాట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా విజయవంతంగా నడవాలి అంటే మహిళా పోలీసులు తమ విధులను బాధ్యతతో కూడిన విధంగా పని చేయాలని తెలిపారు. ప్రతి మహిళా పోలీసు నిజాయితీగా నిబద్దతగా పని చేసినప్పుడే ఎన్నికలు విజయవంతం అవుతాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కడ ఎటువంటి పొరపాటు జరిగిన ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, టూటౌన్ సిఐ అశోక్‌కుమార్, ధర్మవరం రూరల్ ఎస్సై నరేందర్, టౌన్ ఎస్ఐ శ్రీనివాస్, బత్తలపల్లి ఎస్సై శ్రీనివాస్, డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సిఐలు, పోలీస్ సిబ్బంది, వార్డు, గ్రామాల సచివాలయాల మహిళా పోలీసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తేదేపా నుంచి కాంగ్రెస్‌లో చేరిక

గుడిబండ, మార్చి 22 ప్రభాతవార్త



తిప్పేరుద్రప్ప కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున రఘువీరారెడ్డి

మండల పరిధిలోని జమ్మలబండ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు తిప్పేరుద్రప్ప కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో తిప్పేరుద్రప్ప తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. మడకశిర నియోజకవర్గం అభివృద్దికి రఘువీరారెడ్డి నాయకత్వం ఎంతో అవసరమని కావున ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూదిపల్లి నాగభూషణ్, డాక్టర్ రవి శంకర్, కిష్టప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

# గణిత పరీక్షకు 1385 మంది గైహాజరు

**కొత్తచెరువు మార్చి 22 ప్రభాతవార్త** : పదవతరగతి పరీక్షలు ఈ నెల 18నుండి జరుగుతున్నతరుణంలో శుక్రవారం నాడు గణితపరీక్ష జిల్లావ్యాప్తంగా ప్రశంతంగా జరిగిందని ఈ పరీక్షకు సత్యసాయి జిల్లావ్యాప్తంగా 1385 మంది విద్యార్థులు గైహాజరైయ్యారు. పెనుకొండ డివిజన్‌లోని 63 సెంటర్లలో 13878 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 13087 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 791మంది గైహాజరయ్యారు. అలాగే ధర్మవరం డివిజన్‌లోని 52 సెంటర్లలోని11792మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 11,198 మంది విద్యార్థులు హాజరయ్యారు. 594మంది విద్యార్థులు గైహాజరయ్యారు. మొత్తం హాజరు శాతం 94.60 గా నమోదు కావడం జరిగిందని డిఈఓ యు.మీనాక్షి తెలిపారు.

# ప్రచార ప్రకటనలకు ముందుస్తు అనుమతి తప్పనిసరి

పుట్టపర్తి, మార్చి 22, ప్రభాతవార్త

సాధారన ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ప్రచార, ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలకుముందస్తు అనుమతి తప్పసరిగా తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లా స్థాయి మీడియా రిజిస్టర్ కాబడిన రాజకీయా పార్టీలు గానీ, వారి తరపున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి పొందుటకు నిర్ణీత నమూనాలో ప్రకటన ప్రసారం చేయుటకు 3 రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్టర్ కానీ పార్టీలు, ఇతర వ్యక్తులు 7 రోజులకు ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, దరఖాస్తు అందించిన రెండు రోజుల్లో ఎంసిఎంసి కమిటీ అనుమతి మంజూరు చేసు_ందన్నారు. వార్తపత్రికల్లో పోలింగ్ రోజు పోలింగ్ ముందు రోజు ఎంసిఎంసి అనుమతి పొంది ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్నిరకాల టెలివిజన్ ఛానళ్ళు, కేబుల్ నెట్వర్క్‌లు, డిజిటల్ డిస్ప్లేలు, మెబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు వస్తాయని, అలాగే సామాజిక మాధ్యమాలైన సోషల్ మీడియా, ఫెస్‌బుల్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్లు, వికీపిడియా కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తుందన్నారు. అలాగే సినిమా హాళ్ళు, ప్రైవేటు ఎఫ్ఎం రేడియోలలో ఎలక్ట్రానిక్ పత్రికలలోను ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయా ప్రచార ప్రకటనలు కూడా తప ్పనిసరిగా ముందస్తు ధృవీకరణ పొందాల్సి ఉంటుందన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ నెంబర్ సంబంధిత ప్రకటనలపై సూచించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని అన్ని ప్రసార మాధ్యమాలు గమనించాలని, ఎంసిఎంసి అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పరిగణించి భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు చేపట్టడం జరుగుతందని కలెక్టర్ హెచ్చరించారు.

# పరీక్షల నిర్వహణ సిబ్బందికి రెమ్యునరేషన్ పెంపు పట్ల హర్షం

పుట్టపర్తి, మార్చి 22, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం 2024 సంవత్సరం 10వ తరగతి పరీక్షల నిర్వహణ సిబ్బందికి రెమ్యునరేషన్ పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల వైఎస్ఆర్‌టిఎ నాయకులు హర్షం వెలిబుచ్చారు. ఎస్ఎస్‌సి పరీక్షల కోడిగ్ వర్క్, స్పాట్ వాల్యుయేషన్ నిర్వహణ సిబ్బంది కోసం వేతన రేట్లు పెంచుతూ గత సంవత్సరం తీసుకున్న నిర్ణయం ఈ సంవత్సరం అమల్లోకి రావడం జరుగుతుందన్నారు. గత 10 సంవత్సరాలుగా ఈ రెమ్యునరేషన్ పెరగలేదని, వైఎస్ఆర్‌టిఎ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌కుమార్ రెడ్డి కొన్ని ఇతర సంఘాల ప్రాతినిథ్యం మేరకు ఈ రెమ్యునరేషన్ పెంచినట్లు తెలియజేశారు. చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.240 నుండి రూ.396లు, చీఫ్ కోడింగ్ ఆఫీసర్‌కు రూ.220 నుండి రూ.300లకు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్‌కు రూ.198 నుండి రూ.296లకు, అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు ఒక పేపరుకు రూ.6.60పైల నుండి రూ.10ల వరకు పెంచుతూ ప్రభుత్వంచర్యలు తీసుకుందన్నారు. ఈ నిర్ణయం పట్ల ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, పివి.రమణారెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, జంషీద్, పాటిల్ రవీందర్ రెడ్డి, శివయ్య, సుందర్శన రెడ్డి, నాగరాజు, ఇంద్రప్రసాద్, జయరామిరెడ్డి, సునీత, సుబ్బారెడ్డి, శ్రీనివాస రెడ్డి, సుజాత, ప్రతాప్ రెడ్డి, రాజగోపాల్ తదితరులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

# వైసీపీ నుంచి టిడిపిలోకి 40మంది చేరిక

పెనుకొండ, మార్చి 22 ప్రభాతవార్త



పార్టీలో చేరిన వారితో సవిత

వైసీపీ నుంచి టిడిపిలోకి 40 వైసీపీ కుటుంబాలు శుక్రవారం చేరారు. పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమందేపల్లి మండల కేంద్రంకు చెందిన 40 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారు గాజుల ప్రతాప్, మనోహర్, బుల్లెట్ వెంకటేషులు, శ్రీనివాసులు, తేజ, నక్సలగుట్ట రాజేంద్ర, గాజుల నవీన్, రామకృష్ణ, గాజుల హరీష్, కె.రామకృష్ణ, సురేంద్రచారి, సి.జగన్నాథ్ చింతా కేశవ, గాజుల సోమశేఖర్, ఆచారి, హేమంత్ శీల, గాజులసోమశేఖర్, సుబ్బు, ఓబులేసు, అమానుల్లా, జింకబాలు, ఆచారి సూరి నారాయణ చారి, మల్లికార్జున, జింక, నాగరాజు, గుడిపల్లి ఆంజినేయులు, రామాంజి, బాబు ఆదిరెడ్డి, గాజుల చంద్ర, అజయ్, తిరుమలేష్‌నాయక్, పద్మశాలి సుబ్రహ్మణ్యం, మంగళ మరళీ, శ్రీనివాసులు, తేజ, గాజుల ఆంజినేయులు, గాజుల రామాంజినేయులు, వి.సోము, ఎస్.లక్ష్మినారాయణ, గాజుల హరీష్, వి.రమేష్ తదితర వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు.

# ఘనంగా అంతర్జాతీయ జల దినోత్సవం

ధర్మవరం రూరల్, మార్చి 22 ప్రభాతవార్త




అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పట్టణంలోని సాయి నగర్‌లో గల సూర్య ఉన్నత పాఠశాలలో అతర్జాతీయ జల దినోత్సవం ఉపాధ్యాయులు విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించినట్లు హెచ్ఎం నరేంద్ర బాబు తెలిపారు. అనంతరం నరేంద్రబాబు మాట్లాడుతూ.. జీవకోటికి ప్రాణాదారం నీరు, నీరు లేనిదే జీవం లేదు. బావి తరాల భవిష్యత్తు కోసం ప్రతి నీటి బొట్టును కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పూర్వీకులు నీటిని నదులలో చూశారు. మరి నాన్నలు బావులలో, మనంకొళాయిలలో, మన పిల్లలు బాటిల్స్‌లలో చూడడం జరుగుతుందని తెలిపారు. రాబోయే తరం నీటిని ఎలా చూస్తారో అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కావున ప్రతి ఒక్కరూ నీటిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారుతి, శీన, ప్రభావతి, జ్యోతి, హేమ, సుమియా, సునీత విద్యార్థులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

పుట్టపర్తి రూరల్ మార్చి 22 ప్రభాతవార్త



కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న డిఎస్పీ విజయ్‌కుమార్

శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ హరికుమార్ కుటుంబానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ డిఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత చేతుల మీదుగా ఆర్థికసాయం అందజేశారు. హరికుమార్ అనారోగ్యంతో మృతిచెందగా శాఖపరంగా రావలసిన 1,25,000 రూపాయల చెక్కును భార్య పద్మజకు అందజేశారు. పోలీస్ కుటుంబాలకు ఎప్పుడు అండగా ఉంటామని, ఏ సమస్య ఉన్నా నేరుగా వచ్చి తెలియజేయవచ్చని భరోసా కల్పించారు. శాఖా పరంగా రావలసిన ప్రయోజనాలను త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సూపరిండెంట్ సరస్వతి, ఏఆర్‌ఆర్ఐలు చంద్రశేఖర్, రవికుమార్, ట్రెజరర్ ఫొకత్‌వలి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

